
ప్రజాశక్తి

సోమవారం 28 అక్టోబర్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





జమిలి ఎన్నికలు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం..

ప్రజాశక్తి-కందుకూరు: జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తాయని ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ హరిబాబు పేర్కొన్నారు. ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు – భారత ప్రజాస్వామ్యంపై దాని ప్రభావం అనే అంశంపై ఆదివారం అవగాహన కల్పించారు. కందుకూరు దాచూరి రామి రెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఎస్ బోస్ బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య వక్తలు డాక్టర్ హరిబాబు పాల్గొని మాట్లాడారు. యుటిఎఫ్ నాయకులు కిలారి వెంకటేశ్వర్లు, ముప్పరాజు కోటేశ్వరరావు, పి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు డి రామ్మూర్తి, శరత్ ,డి ఎం రాయుడు , ఎల్ఐసి ఏజెంట్ నాయకులు బీడ్యం సుబ్బారావు,రాయని పి కోటయ్య , వివిధ ప్రజా సంఘాల కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిబాబు

'కిసాన్ సెజ్'పై ప్రత్యేక దృష్టి..!



కిసాన్‌సెజ్ ప్రధాన కార్యాలయం

- పారిశ్రామికీకరణతో యువతకు భవిష్యత్తు
- ఇటీవల కలెక్టర్ సందర్శన
- 'వేమిరెడ్డి' మాట నిలబెట్టుకునేనా..
- ప్రభుత్వం నూతన ఇండస్ట్రీయల్ పాలసీ

నూతన ఇండస్ట్రీయల్ పాలసీ, కొత్త పరిశ్రమలు రాకతోనే జిల్లాలోని నిరుద్యోగ యువత భవిష్యత్ ఆధారపడి ఉంది. ఒకప్పుడు పరిశ్రమల కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన సెజ్‌ల్లో ఒక్కటి మాత్రమే మిగిలింది. మాంబట్టు, మేనకూరు, శ్రీసిటి, చింతవరం సెజ్‌లు తిరుపతి జిల్లాకు వెళ్లిపోయాయి. ఇప్పుడు మిగిలింది కేవలం కిసాన్ సెజ్ మాత్రమే. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు కోసం ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ప్రభుత్వం ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేక దృష్టి సారించడానికి ఏర్పాట్లు చేస్తుంది. కిసాన్ సెజ్ యాజమాన్యం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. ఇటీవల కలెక్టర్ ఓ. అనంద్ ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. స్థానిక ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లాలోని నిరుద్యోగ యువతకు భారీగా ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ జరిగితేనే జిల్లాలో అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఆదిశగా అడుగులేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఒకప్పుడు నెల్లూరు జిల్లాలో పారిశ్రామికీకరణ వేగంగా సాగింది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో కిసాన్‌సెజ్ కు 2,770 ఎకరాలు, మేనకూరు సెజ్‌కు 5,600 ఎకరాలు, మాంబట్టుకు 3,300, ఎకరాలు, శ్రీసిటి 5600 ఎకరాలు, చింతవరం సెజ్‌కు 2,600 ఎకరాల భూములు కేటాయించి సెజ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్‌మెంట్ భూములు తీసుకొని పరిశ్రమలు కోసం అప్పటి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మేనకూరు శ్రీసిటి, మాంబట్టు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించారు. ఇటీవల జిల్లాల విభజనలో భాగంగా ఒక్క కిసాన్‌సెజ్ తప్ప అన్ని సెజ్‌లు తిరుపతి జిల్లాకు వెళ్లిపోయాయి. ఇప్పుడు జిల్లాలో పారిశ్రామికీకరణకు మిగిలింది కేవలం ఒక్క కిసాన్ సెజ్ మాత్రమే. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే, జిల్లాలో యువతకు ఉపాధి, ఉద్యోగం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన ఇండస్ట్రీయల్ పాలసీ తీసుకొచ్చింది. ఇప్పటికే ముఖ్యమంత్రి జిల్లాలో



జాతీయ రహదారికి పక్కనే ఉన్న సెజ్ భూములు

వనరులు, పరిశ్రమలు, అభివృద్ధికి సంబంధించి కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆ తరువాత కలెక్టర్ ఒ. ఆనంద్ కిసాన్‌సెజ్‌ను సందర్శించి పరిశీలించారు. ఎంపి వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థాని కంగా ఉద్యోగం, ఉపా ధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

'కిసాన్‌సెజ్‌పై ప్రత్యేక దృష్టి..!

ప్రస్తుతం జిల్లాలో కొడవలూరు మండలం, రేగడిచిలక గ్రామంలో కిసాన్‌సెజ్ ఉంది. 2,776 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేశారు. ఇఫ్కో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకున్న భూముల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు పేరుతో కిసాన్‌సెజ్ ఏర్పాటు చేశారు. 150 ఎకరాల్లో గమేషా ప్రాజెక్టు ఏర్పాటైంది. అనేక మంది యువతకు ఉపాధి కల్పించింది. ఇటీవల మూతపడింది. కోకో పరిశ్రమ ఏర్పాటు కోసం 100 ఎకరాలు తీసు కున్నారు. మరో 50 ఎకరాలు అడుగు తున్నారు. వీటి నిర్మాణాలు కొంత ఆలస్యమైనప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పనకు కిసాన్‌సెజ్ ప్రత్యేక ఏర్పాటు చేసింది. కోకోకోలా తోపాటు, ఇతర పరిశ్రమలు నీటి అవసరాల కోసం 13 కిలో మీటర్లు పైప్‌లైన్ నిర్మించారు. ప్రస్తుత అవసరాలకు ఎంఎస్ఎంఇ ఇండస్ట్రీస్ కోసం 100 ఎకరాలు కేటాయించారు. అవసరాన్ని బట్టి పెంచే అవకాశాలున్నాయి. ఫుడ్ ప్రాసెంగ్ కోసం 600 ఎకరాలు కేటాయించారు. జిల్లాలోని మామిడి, నిమ్మ, గుంటూరు జిల్లాలోని మిర్చి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర వ్యాపితంగా అనేక మంది పారిశ్రామిక వేత్తలు కిసాన్‌సెజ్ వైపు చూస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉండడం, దగదర్తి వద్ద విమానాశ్రయం ఏర్పాటు, దగ్గరగా రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులు ఉండడం ఈ సెజ్‌కు కలిసొచ్చే అంశాలు. ప్రభుత్వం నూతన ఇండస్ట్రీయల్ పాలసీ ప్రకటించిన వెంటనే మంత్రులు పి.నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి కిసాన్‌సెజ్ సిఇఒ సుధాకర్, జిల్లాలోని రైస్ మిల్లర్లు, ఇండస్ట్రీయల్ యాజమానులతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు చర్చించారు. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం నుంచి సెజ్‌కు సహకారం వంటి అంశాలు చర్చించారు. మరికొన్ని పరిశ్రమలు ఇక్కడకు రాడానికి సుముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ, అవకాశాలు పెరిగే అవకాశముంది. ఇంజనీరింగ్ చేసిన యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ చేసిన యువత ఎలాంటి ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లేక ఇంటి వద్ద ఉంటున్నారు. ప్రభుత్వం పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెట్టితే జిల్లా అభివృద్ధితోపాటు, యువతకు మంచి భవిష్యత్ దొరుకుతుందని ఆశపడుతున్నారు. ఎంపి, ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఇక్కడ పరిశ్రమల రాక కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చిన్న చిన్న ఉద్యోగాలకు పొట్టచేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తమకు దగ్గరగా ఉన్న కిసాన్‌సెజ్ వంటి ప్రాంతాన్ని అబివృద్ధి చేయాలని యువత కోరుకుంటోంది.

సిపిఎం రూరల్ 4వ మహాసభ

ఆహ్వాన సంఘం ఏర్పాటు

అధ్యక్షులుగా కట్టా సతీష్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు, పక్కన మాదాల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-నెల్లూరు: నవంబరు 18,19 తేదీల్లో దర్గా మిట్ట జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగనున్న సిపిఎం రూరల్ 4వ మహాసభకు ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. స్థానిక అపోలో సెంటర్‌లోని జక్కా వెంకయ్య భవన్‌లో ఆదివారం ఆహ్వాన సంఘం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు కొండా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మహాసభల నిర్వహణ, శాఖ సమావేశాలు, చర్చలు, డివిజన్ కమిటీ ఎన్నిక తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ 4వ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా కట్టా సతీష్, సహాధ్యక్షులుగా అగిలేరమ్మ, కార్యదర్శిగా కిన్నెరకుమార్, చీఫ్ ప్యాట్రన్స్‌గా మల్లె సింహాగిరి, వీర్ల శ్రీనివాసులు, గంగి సుబ్బారెడ్డి, బోగాల అంజిరెడ్డి, నరమాల సతీష్, కోశాధికారిగా కొండా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్స్‌గా మొత్తం 113 మంది ఎన్నికయ్యారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, పి. సూర్యానారాయణ, ఐద్వా నాయకులు ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకుడు కిలారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుడూరు : ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం సమాజాన్ని విజ్ఞాన పథంలో నడిపించిన యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా గుడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ సంబరాలు మనోహరం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. చలపతి శర్మ మాట్లాడుతూ ప్రాథమిక విద్యని నిర్వీర్యం చేసేందుకు పాలకవర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తు న్నాయని ఉన్నత పాఠశాలల విలీనం చేసి ప్రాథమిక విద్యని రూపుమాపేందుకు గత ఐదు సంవత్సరాలుగా జరుగుతున్న కుట్ర లను యుటిఎఫ్ తిప్పికొట్టిందన్నారు. ఎంఈఓ గోవర్ధన్, వెంకటేశ్వర్లు ,గుడూరు ఉన్నత పాఠశాల పిడి మాల్యాద్రి, మండలం నలుమూల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గుడూరు మండలం యుటిఎఫ్ నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా పి శ్రీనివాసులు రెడ్డి, అధ్యక్షులుగా పి మనోహరం, ప్రధాన కార్యదర్శిగా ఎం రమేష్ బాబు, సహాయ అధ్యక్షులుగా వై మాల్యాద్రి, ఎస్ ప్రసన్న కుమారి, కోశాధికారిగా ఆర్ సుధాకర్, 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమిష్టి కృషి : ఆనం

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రతినిధులందరం కలసి కట్టుగా కృషి చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్లో తిక్కన ప్రాంగణంలో ఇఫ్కో కిసాన్ సెజ్ అధికారులతో ,జిల్లా ఉన్నతాధికారులతో, నగరంలో ఉన్న రైస్ మిల్లుల వేరొక ప్రాంతానికి తరలింపు, దగదర్తిలో ఎయిర్ పోర్టు ఏర్పాటు అంశాలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణ, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ తదితరులు కూలంకషంగా చర్చించారు. అనంతరం మంత్రి రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. దగదర్తి ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ఒక రూపకల్పన చేస్తున్నామన్నారు .ఇటీవల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,



మాట్లాడుతున్న మంత్రులు ఆనం, నారాయణ, పక్కన ఎంఎల్‌ఎలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి

పెట్టుబడుల శాఖా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. దీనిపై కలెక్టర్ నివేదిక ఇచ్చారని, దీని ఆధారంగా ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ఒక రూపకల్పన చేస్తామన్నారు. ఎయిర్ పోర్టు ఏర్పాటు విషయమై మంత్రి నారాయణ ఇటీవల కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తో మాట్లాడారని, త్వరలో ఇన్వెస్ట్మెంట్ కమిటీని పంపుతామని కేంద్ర మంత్రి తెలిపారని మంత్రి చెప్పారు. రాబోయే రెండు నెలల్లో జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించి సానుకూల వాతావరణం ఉంటుందన్నారు. గతంలో రైస్ మిల్లులు నగరానికి దూరంగా ఉండేవని, నగరం విస్తరించడం వల్ల వల్ల నేడు నగరం నడిబొట్టుకు రైస్ మిల్లులు వచ్చాయన్నారు దీంతో కాలుష్యం ఎక్కువైందన్నారు. వాటిని గ్రామీణ ప్రాంతాలకు తరలించాల్సిన అవసరముందన్నారు. దీనిపై శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రైస్ మిల్ అసోసియేషన్లతో చర్చించారన్నారు. కొంతమంది కృష్ణపట్నం వైపు, మరి కొంతమంది ఇఫ్కో కిసాన్ సెజ్ వైపు రైస్ మిల్లు ఏర్పాటుకు భూములు కావాలని కోరుతున్నారన్నారు. అన్నింటిపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి ప్రసన్న లక్ష్మి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని సంఘమిత్ర విద్యాలయంలో జనవిజ్ఞాన వేదిక , యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. డిప్యూటీ డిఈఓ ప్రసన్న లక్ష్మి, సర్వశిక్షా అభియాన్ పిడి సిహెచ్ ఉషారాణిలు ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించి ప్రతిభను కనపరిచిన వారికి ఈ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.విద్యార్థులకు అధ్యాపకులు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిం పజేయాలన్నదే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు పెంపొందింప చేస్తుందన్నారు. అనంతరం చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను డిప్యూటీ డీఈఓ, సర్వశిక్షా అభియాన్ పీడీలు విడుదల చేశారు. పోటీ పరీక్షలకు జిల్లాలోని ప్రభుత్వ , ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కాగా ఒకొక్క గ్రూపులో ముగ్గురు విద్యార్థుల చొప్పున ఈ పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. ప్రయివేట్ పాఠశాలల విభాగంలో కోవూరు ప్రాంతానికి చెందిన ఇంగ్లీషు మీడియం రత్నం పాఠశాల, ధనలక్ష్మిపురం ప్రాంతానికి చెందిన విబిఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వరుసగా ప్రథమన, ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి నగరంలోని కెఎన్ఆర్, ఆర్ఎస్ఆర్ ఎం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఉదయభాస్కర్ అధ్యక్షత వహించారు. తొలుత నిర్వహించిన మ్యాజిక్ షో, క్విజ్ పోటీలు విద్యార్థిని విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర విద్యాలయం కరస్పాండెంట్ కోడూరు రవీంద్రరెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి పి.విద్యాచరణ్, జిల్లా కార్యదర్శి మాదాల రాము, జనవిజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు ఏ.విజయకుమార్, పిపిసి డాక్టరు దత్తాత్రేయులు, శ్రీనూనాయక్,జి.కామయ్య, జనవిజ్ఞాన వేదిక నాయకులు చలపతి శర్మ, డాక్టరు సుధాకర్‌రెడ్డి గుంటూరు నుంచి జనవిజ్ఞాన వేదిక నాయకులు శివనాగేశ్వరరావు హాజరయ్యారు.



ప్రథమ స్థానంలో నిలిచిన రత్నం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు

వెంకంపేటలో వైద్య సేవలు

ప్రజాశక్తి -గూడూరు రూరల్ : మండలంలోని వెంకంపేట గ్రామంలో డాక్టర్ పి మారుతీ రావు ఆధ్వర్యంలో ఎఫ్ పి సి ప్రోగ్రామ్ ఆదివారం జరిగింది. వైద్యాధికారి వెంకంపేట గ్రామ ప్రజలను పరీక్షించి వైద్యసేవలందంచారు. అవసరమైన వారికి ఆరోగ్య పరీక్షలు చేసిసూచనలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఇప్పటివరకు వ్యాక్సిన్ తీసుకొని గర్భవతులను చిన్నపిల్లలను గుర్తించి వారి పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. సిహెచ్ ఓ భాస్కరరావు ఏఎన్ఎం ప్రభావతి ఎం ఎల్ హెచ్ పి మనిషా హెల్త్ అసిస్టెంట్ మల్లికార్జున ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు : మండలంలోని కో డూరు సముద్ర తీరం పర్యాటకుల రాకపోకలతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రా కపోకలు సాగాయి. కుటుంబాల సమేతంగా కదలి వచ్చి తీరం వెంబడి సందడి చేశారు. వించకుండా తీరం వెంబడి ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ చేశారు.

వధూవరులకు 'ఇంటూరి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణానికి చెందిన గుత్తా మాల్యాద్రి కుమార్తె వివాహం అలా వారి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. కందుకూరు మండలం కొండముదుసుపాలెం గ్రామానికి చెందిన కొండూరి వెంకటనరసింహం కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు.


నేడు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

నెల్లూరు : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకూ నెహ్రూ యువ కేంద్ర . ఎన్ఎస్ఎస్ కృష్ణ చైతన్య డిగ్రీ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో దివాలి విత్ మై భరత్ కార్యక్రమాలను 28వ తేది నుంచి 30వ తేది వరకు మూడు రోజుల పాటు నగరంలో నిర్వహిం చనున్నారు. జిల్లా యువజన అధికారి ఏ మహేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తామన్నారు.

'రాళ్లపాడు' జలాలు కలుషితమే..

'క్లీన్' ల్యాబ్ నివేదిక వెల్లడి

ప్రజాశక్తి-కందుకూరు : రాళ్లపాటు రిజర్వాయర్ ద్వారా కందుకూరు నియోజకవర్గంలోని ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషిత జలాలేనని తేలిపోయింది. నీటిని పరీక్షించి హైదరాబాద్‌కి చెందిన క్లీన్ ఎనరో ల్యాబ్ ఈ మేరకు నివేదిక ఇచ్చింది. కందుకూరు నియోజకవర్గ అభివద్ధి కమిటీ పంపించిన నమూనాలను పరీక్షించిన క్లీన్ ల్యాబ్ ఈ నెల 10న ఈ మేరకు నివేదిక ఇచ్చింది. రాళ్లపాడు రిజర్వాయర్‌పై ఆధారపడి రెండు మంచినీటి పథకాలు ఉన్నాయి. వాటిలో ఒకటి రాళ్లపాడు రోళ్ళపాడు పథకం కాగా మరొకటి గుడ్లూరు పథకం. రాళ్లపాడు–రోళ్ళపాడు పథకం వలేటివారిపాలెం,లింగసముద్రం మండ లాల్లోని 45 గ్రామాలకు చెందిన దాదాపు 44 వేలమంది ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తుంది. గుడ్లూరు పథకం ఆమండలం తో పాటు లింగసముద్రం, ఉలవపాడు మండలాల్లోని 56 గ్రామాలకు చెందిన దాదాపు 80 వేల మంది ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తోంది. రెండు పథకాలు కలిపి 101గ్రామాలకు చెందిన 1,24,000 మంది ప్రజలకు మంచినీరు సరఫరా చేయాల్సి ఉంది. చాలా కాలంగా ఈ పథకాలు సరఫరా చేస్తున్న నీరు ఆకుపచ్చ రంగులో ఉంటున్నాయి. దీనిపై ఆందోళన చేపట్టిన కందుకూరు నియోజకవర్గ అభివద్ధి కమిటీ నీటి నమూనాలను పరీక్షలు చేయించింది. ఈ పరీక్షల్లో నీటిలో కలగలిసే ఘన పదార్థాల క్షాణత పరిమితికి మించి ఉన్నాయని, క్లీన్ ల్యాబ్స్ పరీక్షలలో తెలింది.నీటిలో కలగలిసే ఘనపదార్ధల శాతం అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం లీటర్ నీటికి 500 మిల్లీగ్రాములు ఉండాల్సి ఉండగా, రాళ్లపాడు నీటిలో 622 మిల్లీగ్రాములు ఉన్నాయి.క్షాణత లీటర్ నీటికి 200 మిల్లీగ్రాములు మాత్రమే ఉండాల్సి ఉండగా 336 మిల్లీ గ్రాములున్నాయి. ప్రజలు తాగడానికి వినియోగించే నీటి ప్రమాణాలను అమెరికాకు చెందిన పబ్లిక్ హెల్ అసోసియేషన్, అంతర్జాతీయ స్టాండర్డ్ డైజేషన్ సంస్థలు కొన్నేళ్ళ కిందటే నిర్ణయించాయి. ఆ రెండు సంస్థలు నిర్ణయించిన ప్రాణానికాలనే మన ప్రభుత్వం కూడా ఆమోదించింది. అమలు చేస్తోంది. ఈ ప్రమాణాలకు అనుగుణంగా రాళ్లపాడు రిజర్వాయర్ నీరు లేదని క్లీన్ ల్యాబ్స్ స్పష్టం చేసింది.కందుకూరు అభివృద్ధి కమిటీ జల కాలుష్యంపై గొంతు విప్పిన తర్వాత గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు కొన్ని చర్యలు చేపట్టారు. దాంతో ఇంతకు ముందు ఆకుపచ్చ రంగులో కుళాయిల్లో వచ్చిన నీరు ఇప్పుడు కొద్దిపాటి పసుపు రంగుతో వస్తున్నాయి. రక్షిత నీటి పథకాలను సక్రమంగా నిర్వహిం చకపోవడం ఇందు కు ఒక కారణం. రక్షిత నీటి పథకాల ఫిల్టర్ బెడ్లు ఏనాడో దెబ్బతిన్నాయి. వాటికి ఇంతవరకు మరమ్మత్తులు చేయించలేదు. జల కాలుష్యానికి మరో రకమైన కారణం ఏమిటంటే చేపల పెంపకానికి వ్యర్థాలను వినియోగించడం. వాస్తవానికి రాళ్లపాడు రిజర్వాయర్ లో చేపల పెంపకం ,పట్టుకోవడం హక్కులు లింగసముద్రం మండలంలోని కొన్ని గ్రామాల మత్స్యకారులు సభ్యులుగా ఉన్న మత్స్యకార సహకార సంఘానికి సంఘానివి. కానీ గత నాలుగు దశాబ్దాలుగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు మత్స్యకార సహకార సంఘానికి కొద్ది మొత్తంలో డబ్బు మట్టజెప్పి చేపల పెంపకాన్ని హక్కు భుక్తం చేసుకుంటున్నారు. ఇలా చేపల పెంపకం హక్కును కబ్జా చేస్తున్న అధికార పార్టీ నాయకులు చేపలు త్వరగా పెరగడం కోసం కోడిపెంట వంటి వ్యర్థాలన్నలను రిజర్వాయర్‌లో కలుపుతున్నారు. మత్స్యశాఖ నిబంధనల ప్రకారం చేపల పెంపకానికి ఎలాంటి వ్యర్థాలను గాని రసాయనిక పదార్థాలను గాని వినియోగించకూడదు. వ్యర్థాలు, రసాయనిక పదార్థాల వల్ల రిజర్వాయర్ నీరు కలుషితం అవుతున్నాయి. ఈ కలుషిత జలాలను తాగడానికి ప్రజలు ఇష్టపడటం లేదు. రక్షిత నీటి పథకాల పరిధిలోని 90 శాతం మంది ప్రజలు కొళాయిల ద్వారా వచ్చే నీటిని తాగడం లేదు. తమ గ్రామాల్లో ఉన్న బోర్లు, బావులు వంటి ఇతర జల వనరులను తాగడానికి వినియోగించుకుంటున్నారు. అలాంటి అవకాశం లేని ప్రజలు జలశుద్ధి ప్లాంట్ల విక్రయించే మంచినీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు.



రాళపాడు నీరు కలుషితమని ఇచ్చిన ల్యాబ్ నివేదిక ఇదే..



రాళ్లపాడు ప్రాజెక్టు..

వృద్ధులకు అన్నదానం

నెల్లూరు : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ కవితల కుమారుడు మాస్టర్ తేజాన్ష్ రెండవ పుట్టినరోజు సందర్భంగా పాత మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణంలోని నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ సి.ప్రేమ్ దీప్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కందుకూరు : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని కందుకూరు పట్టణ ఎస్ఐ సాంబశివయ్య మెచ్చరించారు.ట్రిబుల్ రైడింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్,రాష్ డ్రైవింగ్,డ్రైవింగ్ లైసెన్స్,డాక్యుమెంట్స్ లేకుండా డ్రైవ్ చేయటం చేసే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్,పోస్టాఫీసు సెంటర్‌లో వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు

వ్యాసరచన పోటీలు

నెల్లూరు : పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలల్లో భాగంగా ఆదివారం నగరంలోని ఉమేష్ చంద్రా కాన్ఫరెన్స్ హాలులో వ్యాసరచన పోటీలు పోటీలు నిర్వహించారు. ఎస్పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఏఆర్ విభాగం డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలల్లో పలువురు పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. "పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్ళు" అనే అంశంపై ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేయ నున్నారు. ఎస్‌బి–2 శ్రీనివాసరెడ్డి ఆర్ఐ అడ్మిన్ హరిబాబు, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేత

పజాశక్తి-కందుకూరు : అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణం మొదటి దశ పూర్తయి, రెండవ దశ అని వేటి మండప నిర్మాణం జరుగుతోంది. భక్తులు తమ వంతు సాయంగా విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మంచిరాజు వెంకట మురళీమోహన్ భార్య చంగాళ అపర్ణ రూ 25116లు,కోయగుంట్ల బాల అంకయ్య భార్య రమణమ్మ రూ 5116లు విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వెంకటరెడ్డికి అందజేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ

నెల్లూరు : వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి విద్యార్థిని ఆత్మహత్య ప్రయత్నానికి కారకుడైన వ్యక్తి హాసన్ ను ఫోక్సో చట్టం కింద అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రారెడ్డి భవన్ లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండ శ్రీహర్ష మాట్లాడారు. అనంత సాగరం మండలంలోని కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని వేధింపుల కారణంగా ఆత్మహ త్యాయత్నం చేసుకోవటంబాధాకరమన్నారు. ఆ విద్యార్థి ఆత్మ హత్యాప్రయత్నానికి కారణమైన హసన్ అనే విద్యార్థిని శిక్షించాలని డిమాండ్ చేశారు.. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను.నరేంద్ర,ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి డి.చరణ్, నగర కమిటీ సభ్యులు విష్ణు,జీవన్,యశ్వంత్, రంజిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

17 ఏళ్లుగా డిప్యూటేషన్‌పైనే..

విఆర్ఓ ఉద్యోగ విధులపై రెవెన్యూ శాఖలో చర్చ

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు : ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి. అయితే అదెలా సాధ్యమో తెలియదు గానీ, ఎక్కడికి బదిలీ చేసినా, ఎవరు బదిలీ చేసినా 24 గంటల్లోనే తిరిగి తాను కోరుకున్న ప్రాంతానికి డిప్యూటే షన్ పై వచ్చేయడం ఆ ఆ విఆర్ఓకే చెల్లింది.. ఏకంగా గత 17 ఏళ్ల డిప్యూటేషన్ పై ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న విఆర్ఓ వైనం ఇదీ...ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలో పనిచేస్తున్న ఓ విఆర్ఓనుకలెక్టర్ ఆనంద్ తోటపల్లిగూడూరు మండలం పేడూరుకు బదిలీ చేశారు. అయితే 24 గంటల వ్యవధిలోనే ఆయన మళ్లీ నెల్లూరు రూరల్ మండలానికి వచ్చేయడం గమనార్హం. ఆయన గత 17 సంవత్సరాల నుంచి డిప్యూటేష న్ పైనే ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేస్తూ వ స్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఐదేళ్లకు బదిలీలు వుంటాయి. ఈ లెక్కన ఈ విఆర్వో 17 ఏళ్లలోమూడు సార్లు బదిలీ కావాలి. అధికారులు బ దిలీ చేయడమే తరువాయి, బదిలీ చేసిన గంటల వ్యవ ధిలోనే డిప్యూటేషన్ పై తాను కోరుకున్న ప్రాంతానికి ఇ టు వచ్చేయడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనలు ఆ విఆర్వోకు ఎందుకు వర్తించడం లేదో అర్థం కావడం లేదు. కలెక్టర్ ఆనంద్ బదిలీ చేసిన వెంటనే ఆ విఆర్ఓ విధుల్లో చేరకుండా డిప్యూటేషన్ కోసం గత ఆర్‌డిఓ మలోలా దగ్గర చేసిన ప్ర యత్నాలు బెడిసి కొట్టినట్లు తెలిసింది. మలోలా స్థానంలో వచ్చిన కొత్త ఆర్‌డిఓ ఆ విఆఆర్‌ను డిప్టేషన్ పై బదిలీ చేయడం గమనార్హం.ఏది ఏమైనా ఆ విఆర్ఓ విధుల నిర్వహణపై రెవిన్యూ శాఖలో చర్చ తీవ్రంగా జరుగుతోంది.

చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు : డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ చంద్రశేఖర్ ని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవి. సాంబశివరావు సత్కరించారు. ఆదివారం వనంతోపు సెంటర్, జనహిత వాత్సల్య ఆశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అరవ పరిమళ, విశ్వనాథం, కల్పం శ్రీనివాసులు, విజయమ్మ, ఖాదర్ బాషా , బాలు, మల్లికార్జున ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గం ప్రైవేటు పాఠశాలలు(అపస్మా) అద్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నైపుణ్య తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 600 మంది పదో తరగతి విద్యార్థులు 16 పాఠశాల నుండి పాల్గొన్నారు వక్తలు సుబ్బరాజు, శర్మ పాల్గొన్నారు. అదేవిధంగా అపస్మా కందుకూరు ప్రెసిడెంట్ రామారావు, కార్యదర్శి సాయిబాబు,నాయకులు ఎం మాలకొండయ్య పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- కమిషనర్ సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు

పచ్చదనాన్ని పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందజేసేందుకు పార్కులు ఎంతగానో దోహదపడతాయి. ఈ నేపథ్యంలో నగర పరిధిలో కొన్నిచోట్ల పార్కుల నిర్మాణం కోసం ప్రజాధనాన్ని ప్రభుత్వం ఖర్చు చేసింది. అయితే ఆ పార్కులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో పార్కుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో కమిషనర్ ఎం.సూర్యతేజ మాటల్లో...

ప్రశ్న. నగర పాలక సంస్థకు చెందిన కొన్ని ఖాళీ స్థలాల్లో పార్కుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి, ఎందుకూ పనికి రాకుండా పోయి ఉన్నాయి. అటువంటి పార్కుల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగర నియోజకవర్గ పరిధిలోని పార్కులన్నింటిని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభించాం. పార్కులకు సమీపంలో ఉన్న నగర పాలక సంస్థ ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగ పడేలా అందుబాటులో తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కొన్ని పార్కులను సందర్శించాం. ముఖ్యంగా గాంధీ నగర్ పార్కు, పినాకినీ అవెన్యూ పార్కు, వేప దొరువు, బాలాజీ నగర్ పార్కుల రక్షణకు అవసరమైన ప్రహరీ గోడలు, గేట్ల నిర్మాణాలు చేసి వాచ్‌మెన్‌లను నియమించాలని నిర్ణయం తీసుకున్నాం. పార్కుల్లో చిన్నపిల్లలకు ఆహ్లాదాన్ని అందించే మొక్కలు, పచ్చదనం, విద్యుత్ వెలుగులు, ఫౌంటైన్లు, అన్ని క్రీడా వసతులతో పాటు, వ్యాయామ సామగ్రిని కూడా ఏర్పాటు చేయనున్నాం. అదేవిధంగా ముత్తుకూరు రోడ్డు కూడలి ఫ్లైఓవర్ కింద పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నాం. మినీబైపాస్‌లోని నుడా పార్కులో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ఆ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నాం.

ప్రశ్న. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నగరంలో దోమలు విజృంభించి ప్రజలపై తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. దోమల నివారణకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకుంటున్నాం. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది సహాయంతో అత్యంత ప్రాధాన్యత తీసుకుంటున్నాం. దోమల పుట్టి పెరిగేందుకు అవకాశం ఉన్న చెత్తను, డ్రెయినేజీని తొలగించేందుకు ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణతో పాటుగా అన్ని డ్రెయిను కాలువలలో పూడికతీత పనులు, మురుగు తొలగింపు, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. మిలటరీ కాలనీ, కొండాయపాలెం, రంగానాయకుల పేట, బ్రహ్మానందపురం, గాంధీగిరిజన కాలనీ, కపాడిపాలెం, సంతపేట మార్కెట్ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయిను కాలువల పూడికతీత పనులు చేపట్టాం. నగర ప్రజలంతా బాధ్యతగా భావించి వ్యర్థాలను నిర్ధేశించిన చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తాం. ఇరుకు సందులు, ముళ్ళ పొదలు, మురుగునీటి ఖాళీ స్థలాలు, బురద మయమైన చిత్తడి ప్రాంతాలలో కార్మికులు చేరుకోలేరని, అందువల్ల ఆయా ప్రాంతాలు దోమల ఎదుగుదలకు ఆవాసంగా మారుతున్నాయని అలాంటి ప్రదేశాల్లో ఫాగింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మానవ రహిత డ్రోన్‌లను వినియోగించి దోమల నివారణా చర్యలను తీసుకున్నాం. ఇటీవల ప్రయోగాత్మకంగా సంతపేట, ఇందిరా నగర్, బివి నగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించాం.



ప్రశ్న. కార్పొరేషన్ పరిధిలో నూతన భవన నిర్మాణాలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పంట కాలువలు, డ్రెయినేజీ కాలువలు సైతం ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఇంటర్వ్యూ

జవాబు. నగర పాలక సంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాలకు లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్ (ఎల్.టి.పి) కార్పొరేషన్ భవన అనుమతుల కోసం పొందుపరచాల్సిన పత్రాలు అన్ని తప్పనిసరిగా సమర్పించి తద్వారా కార్పొరేషన్ వారి అనుమతి పొందిన పిమ్మట భవన నిర్మాణాలు చేపట్టాలి. అందుకు విరుద్ధంగా నిర్మాణలు గుర్తిస్తే కార్పొరేషన్‌కు సమాచారం అందజేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. నగరంలో నూతన భవన నిర్మాణ పనులు ఎప్పటిక కప్పడు తనిఖీలు చేసి అధికారులు కార్పొరేషన్ వారి ఉత్తర్వులకు విరుద్ధంగా భనవ నిర్మాణ పనులు జరుగుతుంటే చర్యలు తీసుకోవాలని సూచనలు చేశాం. ముఖ్యంగా కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందిన భవన యజమానులు నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టేలా, వర్షపునీరు భూమిలో ఇంకేలా ఇంకుడుగుంట తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా, రోడ్లను అక్రమిస్తూ మెట్లు, ర్యాంపులు నిర్మాణం జరగకుండా, వర్షపు నీరు డ్రైయిను కాలువల ద్వారా సాఫీగా ప్రవహించడానికి వీలుగా రూపొందించి, నిర్మాణాలను పరిశీలించాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన నిర్మాణాలను అన్ని భవన సముదాయాల్లో ప్రణాళికాబద్ధంగా జరిగేలా జాగ్రత్తలు వహించాలన్నారు. నూతన భవనాల నిర్మాణాల అనుమతులకు దరఖాస్తు చేసే సమయంలోనే ఏలాంటి ఉల్లంఘనలు లేకుండా సరి చూసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలను పరిశీలించి తప్పని సరిగా ఆక్రమణలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఇది వరకే ఆదేశించాం.



తమ ఆవేదనను తెలియజేస్తున్న బాధితులు

దారి చూపండి సారూ..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : తన పొలానికి వెళ్లేందుకు దారి చూపాలని లేబూరు గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ కోరారు. ఆదివారం లేబూరు గ్రామంలోని తన పొలానికి వెళ్లే బాట వద్ద తన భార్య దిల్షాద్‌తో కలిసి అధికారులు తనకు న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. మండల కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన ఫలితం లేదని ఆవేదన చెందారు. అనంతరం బాధితుడు మాట్లాడుతూ తనకు లేబురు గ్రామంలో 2 ఎకరాల 75 సెంట్లు పొలం గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నానని, తన పొలానికి పోవుటకు సర్వ హక్కులు కలిగిన బాట ఉందని, అయితే తమ ముందు పొలం రైతులు ఏకోల్లు రామిరెడ్డి, ఊటీ శివయ్య, శేషయ్య, పార్ధయ్యలు తమ పొలానికి వెళ్లనివ్వకుండా దౌర్జన్యానికి పాల్పడి తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతు ఇస్మాయిల్ వాపోయాడు. ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఇస్మాయిల్ దంపతులు వాపోయారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తమ పొలానికి పోవు బాటను చూపించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-చేజర్ల : మండలంలోని యనమదల గ్రామంలోని ఎస్‌టి కాలనీలో ఆదివారం గుళికలు తిని వివాహిత ఆత్మహత్యాయతానికి ఒడిగట్టిన వైనం చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లినేని పెంచలయ్య అసభ్యకరంగా మాట్లాడుతూ తనను లైంగికంగా వేధిస్తున్నాడని, తన మాట వినకపోతే చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని తెలియజేసింది. ఇటువంటి తీవ్రమైన వేధింపులను తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిజేసింది. బాధితురాలు ఆత్మకూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

3న మంద కృష్ణమాదిగ రాక

ప్రజాశక్తి-కావలి

కావలి టౌన్ అరుంధతీయవాడలో ఆదివారం నియోజకవర్గ అత్యవసర సమావేశం ఎంఎస్‌పి కావలి నియోజకవర్గ అధ్యక్షులు అక్కిలగుంట ఏసు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ మాట్లాడారు. ఈ పర్యటన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు పంబంటి అంబేద్కర్ మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వేగూరు వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్‌పి జిల్లా మహిళా నేత జానకి మాల, సిద్దారపు పెంచలయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి నాయకులు కత్తి శివయ్య మాదిగ, చేవూరి వరప్రసాద్ మాదిగ, దర్శిగుంట కోటయ్య మాదిగ, మంద మహేష్ మాదిగ, రావిపాటి అనిల్ మాదిగ, అక్కిలగుంట సామ్యేల్ మాదిగ, మన్నేపల్లి రమేష్, చేవూరి మాల్యాద్రి, చేవూరి వంశీ, గడ్డె శేకుమార్, చేవూరి వంశీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : ఎంఆర్‌పిఎస్ అధినేత మంద కృష్ణమాదిగ 3వ తేదీన జిల్లా పర్యటన ఉందని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి మాదిగ పిలుపునిచ్చారు. ఇంజమూరులోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తమ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వి వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, పెంచలయ్య మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్, బాల గురవయ్య, జి ఆనంద్, వెంగళరావు, సురేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ప్రాంతం అనాదిగా ప్రభుత్వాల నిరాదరణతో వెనుకబాటుకు గురైందని, ఇకనైనా అభివృద్ధి పథం వైపునకు అడుగులు పడేందుకు జిల్లా సీనియర్ నాయకులుగా తోడ్పాటు అందించాలని ఎంఎల్‌ఎ శ్రీధర్ రెడ్డిని ఉదయగిరి జిల్లా ఉద్యమనేతలు కోరారు. ఆదివారం నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో డాక్టర్ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని వెనుకబడిన 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లాగా చేయాలని కోరారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సోమశిల హై లెవెల్ కాలువ ద్వారా లేక వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా గానీ సాగునీరు అందించాలని కోరారు. తాగు, సాగునీరు లేక మెట్టప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఇక్కట్లు పాలవుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. విద్య, వైద్య, రవాణా తదితర సౌకర్యాలు లేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా చేయడం ద్వారా శీఘ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని వారు కోరారు. జిల్లా ఉద్యమ నాయకులు ఎమ్‌డి ఖాజా, మురళి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న దృశ్యం

సరుకులు అందజేత

ప్రజాశక్తి-కావలి

డి.ఆర్. విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్‌లోని తమ కార్యాలయంలో ఆదివారం డి.ఆర్. పేరిట 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేలు విలువ చేసే 10కేజీలు బియ్యం, వంటింటి సరుకులు, రొక్కం రూ.60 పంపిణీ చేశారు. ఈ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ డి.ఆర్. గొప్ప మానవతావాది అని, విద్యాప్రదాత అని, వారు సమాజానికి చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు. డి.ఆర్ మార్గంలో కళాశాలలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్ రెడ్డి, విద్యాధర కుమార్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. ఈ సేవా సమితిలోని వృద్ధులకు తనవంతు ఉచితంగా వైద్యం అందిస్తానన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల విజయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ కనంగ తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మహోహరరెడ్డి, సేవా సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ ప్రసాద్, సతీష్ సింగ్, రంగనాయకులు, బాషా పాల్గొన్నారు.

బాధితులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కావలి

గృహ హింస నిరోధక చట్టం – 2005 గురించి బాధితులకు అవగాహన కల్పించాల్సిన అవసరమెంతైనా ఉందని కావలి ఉమెన్స్ ఫోర్ట్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో మహిళా సంఘాల పోరాట ఫలితంగా సాధించుకున్న గృహహింస నిరోధక చట్టం 2005లో ఆచరణలోకి వచ్చిందని తెలిపారు. కాబట్టి రక్షణాధికారులు మహిళలకు విస్తారంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. అప్పుడే గృహహింస నిరోధక చట్టం ప్రకారం మహిళలు ప్రయోజనాన్ని పొందగలుగుతారన్నారు. ఈ అవగాహనా సదస్సులకు మహిళా సంఘాలను కూడా ఆహ్వానించాలని కావలి ఉమెన్స్‌ఫోర్ట్ బాధ్యులు సి.శారద కన్వీనర్, షేక్.నూర్జహాన్, టి.సుజాత, షేక్.ఫాతిమా, అరుణ తదితర కార్యకర్త సభ్యులు కోరారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలం లోని పొంగూరులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ ఉపసర్పంచ్ ఏలూరు శివప్రసాద్, రమణయ్య, రామచంద్రయ్య ప్రారంభించారు. గ్రామంలో టిడిపి సభ్యత్వాలు అధిక శాతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. సభ్యత్వ నమోదులో రూ.లక్ష కట్టిన వారికి శాశ్వత సభ్యత్వం, రూ.100 చెల్లించిన వారికి రెండేళ్ళ పాటు సభ్యత్వం ఉంటుందన్నారు. అలాగే సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ప్రమాదబీమా సౌకర్యాన్ని రూ.5లక్షలకు పెంచారన్నారు. సభ్యత్వాన్ని మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్, వాట్సప్ ద్వారా అయితే లింక్ ద్వారా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు, వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, సొంపల్లి లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నల్లని సుబ్బారావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో రాష్ట్ర టిడిపి మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా పులిమి శైలజా రెడ్డి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. ప్రతిఒక్కరూ టిడిపి సభ్యత్వ నమోదును స్వీకరించి పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నెల్లూరు - తాటిపర్తి రోడ్డు నిర్మాణాన్ని పటిష్ట పరచాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నూతనంగా చేపడుతున్న నెల్లూరు – తాటిపర్తి రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలి రోడ్డు నిర్మాణాన్ని పటిష్టంగా ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. 25వ తేదీ దేవరపాలెం గ్రామంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండల మహాసభలో జరిగిన తీర్మానాల అమలు కోసం ఆదివారం సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి. జనార్ధన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం నెల్లూరు రూరల్ మండలంలో ములుమూడి నుంచి రామయ్య చెరువు వరకు డబుల్ రోడ్డు పనులు జరుగుతూ, రామయ్య చెరువు దగ్గరి నుంచి కందమూరు వరకు సింగల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. కందమూరు వరకు రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలి తొక్కించకుండా ఇరువైపులా రోడ్డు పక్కన ఉన్న చౌడు మట్టినే చదును చేస్తున్నారన్నారు. దాంతో ఇరువైపులా కాలువలు ఉండడంతో వర్షాకాలంలో వాహనాలు దిగబడి ప్రయాణికులకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. కాబట్టి రోడ్డుకి ఇరువైపులా ఖచ్చితంగా గ్రావెల్ వేసి తొక్కించాలన్నారు. నెల్లూరు – తాటిపర్తి రోడ్డుకు కింద తూములు ఉన్న దగ్గర రోడ్డు కుంగిపోకుండా శాశ్వత ప్రాతిపదికన కల్వర్టులను నిర్మించాలన్నారు. నవంబరు, డిసెంబరులలో వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున పొట్టేపాలెం, ములుమూడి వద్ద హైలెవెల్ వంతెనలను వెంటనే నిర్మించాలని తెలిపారు. దేవరపాలెంలోని నరసింహస్వామి కొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పంపుసెట్‌కు ఇచ్చే కరెంటును 9 గంటల నుంచి 7 గంటలకు కుదించారని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులకు 9 గంటలపాటు విద్యుత్ ఇవ్వాలని చేసిన తీర్మాణాల అమలు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జానా లక్ష్మీప్రసాద్, శ్రీపతి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం మల్లాయ పాలెంలోని గంగా భవాని దేవస్థానంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం ఎంఎల్‌ఎ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో బోగోలు మండలం టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.



బెల్ట్‌షాప్ వద్దన్నందుకు దాడి

ప్రజాశక్తి-కోవూరు : ఇళ్ళ మద్యలో బెల్ట్‌షాప్ వద్దు అన్నందుకు దారి కాచి అడ్డుకొని దాడి చేసిన సంఘటన ఆదివారం ఇనమడుగు సెంటర్‌లో చోటు చేసుకుంది. భాదితులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వేగూరు, వసంతపురం గ్రామంలో శనివారం రాత్రి మద్యం అమ్ముతున్నారన్న విషయం పై ఆ ప్రాంత మహిళలు శనివారం రాత్రి కోవూరు పోలీసులకు తెలిపారు. పోలీసులు వస్తామని చెప్పడంతో మహిళలు తిరిగి వెళ్ళిపోయారు. ఆ విష యం తెలుసుకొన్న బెల్ట్‌షాప్ నిర్వాహుకులు నరసిం హులు, ఈశ్వర్, నారాయణ వారిపై దురుసుగా ప్రవర్తించారు. దానిని మనసులో పెట్టుకొని తమపైనే పోలీసులకు చెబుతావా అని వసంతపురం గ్రామానికి చెందిన వెంకట రమణయ్యను ఇనమడుగు సెంటర్లో కరతో తలపై కొట్టాడు. అది గమనించి ఆటుగా వెల్తున్న నెల్లూరు గిరి అడ్డురాగా అతనిపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాంతో చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. పోలీసులకు విషయం తెలియడంతో ఇరుపక్షాలపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గాయపడిన బాధితుడు


మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తా..

ప్రజాశక్తి-బిట్రగుంట

సముద్ర తీర ప్రాంతం కోతకు గురి కాకుండా చర్యలు చేపడతామని కావలి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో సముద్రతీర ప్రాంతం కోతకు గురైన ప్రాంతాన్ని కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, ఫిషరీస్ జెడి నాగేశ్వరావులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానిక మత్స్యకార కాపులను, మత్స్యకారులను అడిగి విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కావ్య కష్ణారెడ్డి మాట్లాడుతూ సముద్రం కోతకు గురికాకుండా రెండు కోట్ల రూపాయలతో రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో గ్రామం నుండి అత్యధిక మెజారిటీ ఇచ్చారని, మీ సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తానని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉండి ప్రజలను కాపు కాస్తానని, గతంలో అభివృద్ధి ఏదైనా జరిగిందంటే అది కేవలం టిడిపి ప్రభుత్వం హయాంలోనే అని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, మత్స్యకారులకు పెద్దబోట్లు ఇచ్చే ఏర్పాటు కూడా చేస్తానని వారికి హామీనిచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయిన్‌లు, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, టిడిపి కావాలని నియోజక వర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు బీద గిరిధర్, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, మాజీ ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు పాల్‌శెట్టి, గ్రామ కాపులు, మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి



యువకుడి మృతి

ప్రజాశక్తి-కోవూరు

చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి గిరిజన యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని జమ్మిపాలెం పెన్నా పరివాహక ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు కోత్తూరు రామాలయం సమీపంలో నివాసముంటున్న చింత రాంబాబు (40) సరిగా ఈతకూడా రాదని, అయినా చేపలు వేటకు వెళ్ళాడని తెలిపారు. చేపల వేటకు వెళ్లి నట్లు ఆనవాళ్ళు పూర్తిగా కనిపించాయన్నారు. ఆ మేరకు కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంఘటనా స్థలానికి వీరో హరి ఫైర్ సిబ్బంది తదితరులున్నారు.

సైడ్ కాలువ నిర్మించాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలోని దర్గా సెంటర్లోని రెండో గేటు నుంచి ఆనకట్ట వరకు సైడ్ కాలువ నిర్మించాలని, అక్కడ నివాసం ఉండే మైనార్టీలు కోరుకుంటున్నారు. ఇటీవల కాలంలో గత వైసిపి ప్రభుత్వం దర్గా సెంటర్లో సర్వే నిర్వహించి, ఈ ప్రాంతంలో సైడ్ కాలువలు నిర్మించకపోవడం వల్ల, వర్షం పడితే నీరు, మురుగు నీరు ఏకమై దుర్వాసన వెదజల్లుతూ ఆ దారిన నడవాలంటే అగమ్య గోచరం అవుతుందని, గత ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉందని అక్కడ ప్రజలు, దర్గాకు వచ్చే యాత్రికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇదే విషయాన్ని దేవాదాయ శాఖ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి కూడా తెలియజేశారు. గతంలో ఈ కాలువల పనులు వైసిపి నాయకులు చేసినట్లు, కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఈ కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- ఆత్మకూరుఅర్బన్ : అనంతసాగరం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినిని మోసం చేసి అమ్మాయి జీవితంతో చెలగాటమాడి అమ్మాయి వీడియో, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి యువతి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతిని పరామర్శించి ఆగాయిత్యానికి పాల్పడిన హసన్‌ను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా నేత ఆత్మకూరు నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరుగకపోతే తాము ఉద్యమం చేస్తామన్నారు. బాధితురాలికి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. వివాహమై ఇద్దరు పిల్లల తండ్రిగా ఉన్నా బాలికపై తప్పుడు వీడియోలు కాలేజీకి పంపగా వాటిని గోప్యంగా ఉంచి అమ్మాయి భవిష్యత్తుకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన కాలేజీ యాజమాన్యం అందరి విద్యార్థుల ఎదుట యువతి పరువు తీసి కాలేజీ నుంచి పంపివేయడం తీవ్ర పరిణామన్నారు. కాలేజ్ యాజమాన్యంపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్‌పి, హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి అమ్మాయిని మోసం చేసిన వారిని తీవ్రంగా శిక్షించేలా చర్యలు చేపడతామన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

మంచిమాట కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: తెలుగు భారతి సేవాసమితి వారి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే 'మంచి మాట' కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక గ్రంథాలయ ప్రాంగణంలోని తెలుగు భారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపు రెడ్డి పెద వేంకటరెడ్డి, సాంబశివ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, గౌరవాధ్యక్షులు అంకిన పల్లె గోవింద రెడ్డి, సహాధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఎస్ వి రమణయ్య, యానాది రెడ్డి, శేషారెడ్డి, నారాయణ రావు, సహ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బయ్య, నరసింహారెడ్డి, ఓంకారం రాజు, రాఘవేంద్ర రావు, పెంచలరెడ్డి, క్రలిశెట్టి రవీంద్ర కుమార్, శివరామిరెడ్డి, రామమోహన్ రెడ్డి, సురేష్, వెంకయ్య, అపర్ణా చక్రవర్తి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి : గౌరవరం సాయి దేవస్థానంలో అర్చకులుగా పని చేస్తున్న నాగేంద్ర స్వామి అర్చకులకు యూరిన్ సంబంధించిన సర్జరీ తేజ హాస్పిటల్ నెల్లూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు కావలి బ్రాహ్మణ మహాసంఘం తరపున ఆదివారం సాయంత్రం నగదు రూపంలో రూ.22వేలు గౌరవరంకు వెళ్లి వారి ఇంటి వద్ద వితరణంగా అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పి.వి.ఎస్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ టి.వెంకటేశ్వర్లు, కె.శేషగిరి రావు, ప్రాంతీయ కార్యదర్శులు టి.రమేష్, స్వయంపాకుల రవికుమార్ శర్మ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్ రాజేంద్రకుమార్, కన్స్యూమర్ ఫోరం స్టేట్ సెక్రటరీ తెలికేపల్లి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-కావలి : హైకోర్టు ఆదేశాల మేరకు కావలి సీనియర్ సివిల్ జడ్జీ పరిధిలో ఉన్న బోగోలు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎస్.సి గురుకుల బాలికల హాస్టల్‌ను, కావలిలోని ఎస్.టి. బాలికల హాస్టల్‌ను ఆదివారం లోక్ అదాలత్ చైర్మన్ ఎం.శోభ తనిఖీలు నిర్వహించారు. ఆయా హాస్టల్‌లో ఉన్న బాలికలకు అందిస్తున్న, ఆహార పదార్థాలు, శానిటైజేషన్, మంచి నీటి సరఫరా, మెడికల్ కేర్, విద్యా బోధన, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అధ్యయనం చేశారు. అనంతరం అక్కడ ఉన్న టీచర్లకు బాలికలకు నాణ్యమైన ఆహారంను, విద్యను అందించాలని సూచించారు. బాలికలు బాగా చదువుకుని క్రమశిక్షణ కలిగి ఉన్నత శిఖరా లకుచేరుకోవాలన్నారు. లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయిప్రసాద్, ప్రిన్సిపల్ పద్మావతి, లోక్ అదాలత్ సిబ్బంది కలిసి పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

కరాటే పోటీలను ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : కరాటే (జూ జిట్సు) పోటీలను ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఏపి 5వ జూ జిట్సు చాంపియన్ షిప్ పోటీలు కావలి పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలకే పరిమితం కాకుండా పిల్లలను ప్రోత్సహిస్తూ వాళ్ళను చైతన్య పరుస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. కొన్నికొన్ని పోటీల వల్ల మానసిక పరివర్తన, శారీరకదారుఢ్యం పెరుగుతుందన్నారు. తనను తాను రక్షించుకోవడానికి కరాటే అని అన్నారు. ఎలాంటి ఆయుధం లేకుండా మనసును ఏకాగ్రతతో ఉంచి చేతినే ఆయుధంగా వాడటం ఈ కరాటే లక్షణం అని తెలిపారు. గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, తటవర్తి రమేష్, తిరువీధి ప్రసాద్ పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం ఏరియా హాస్పిటల్ నోడల్ ఆఫీసర్, కర్నాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కర్నాటి రోహిత్ – డాక్టర్ కర్నాటి. నాగభార్గవి దంపతుల కుమార్తె చిన్నారి కర్నాటి. అనూరాధ వాసుకిలి రెండో పుట్టినరోజు సందర్భం గా ఆదివారం బుడంగుంట గిరిజన కాలనీలోని పేదలకు సంయుక్త సేవాసంస్థ ద్వారా అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు డాక్టర్ కర్నాటి రోహిత్ – డాక్టర్ కర్నాటి నాగభార్గవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.